# కొత్త పూల నెత్తావులు

ఆ అయిదుగురు బాలికామణుల రాకతో నాయుడు వంకలో బాడిస చెట్ల కొనకొమ్మల్లో ఎర్రపూలు గుత్తులై పూచాయి. చెట్లు కొత్త చివుళ్ళు తొడిగాయి. గున్నమామిళ్ళు పూతకొచ్చాయి. గండుకోయిలలు గొంతులెత్తాయి. గుండుమల్లెల గుండె తలుపుల గొళ్ళాలు జారిపోయాయి. తుమ్మెదలన్నీ తెమ్మెర తీగల్ని ఝుమ్మని మ్రోగించాయి. నారి సవరించి చెరకు వింటిలో పుష్పబాణాన్ని సంధించాడు మదనుడు.

బస్తీకి కిలోమీటర్ దూరంలో ఆకు పచ్చని కోకగట్టిన అంగనామణి నెన్నడుములా పైరు పచ్చల నడుమ అందంగా అమరిన చిన్నపల్లె నాయుడు వంక. పరిస్థితులు పై మెట్టునుండి కింది మెట్టుకు దిగిపోవడంతో బస్తీ నుంచి నాయుడు వంకకు నడిచి వచ్చింది వళ్ళియప్ప కుటుంబం. రెండు చేతులా సంపాదిస్తున్న మహర్దశలో పెద్దకూతురికి మాత్రం పెళ్ళి చేయగలిగాడు వళ్ళియప్ప. ఉద్యోగ విరమణ చేశాక, గంపెడు సంతానం, ఉత్తచేతులూ, కోలుకోలేని పక్షవాత రోగం అతనికి మిగిలాయి. బస్తీలో ఉంటూ మూడంకెల్లో ఇంటద్దెలిచ్చుకోవడం తలకుమించిన బరువు. అప్పులు తీర్చగా మిగిలిన మూడు వేల రూపాయలతో నాయుడువంకలో పూరిల్లు కొనుక్కొని, ఆ నీడపట్టున పడి ఉందామని వచ్చారు వాళ్ళు.

వళ్ళియప్పకు ఎంతో కొంత ఫించను వస్తుంది. పెద్ద కొడుకు బాల మురుగన్ ఎలక్ట్రిసిటీ బోర్డులో లైన్‌మేన్‌గా పని చేస్తున్నాడు. రెండో కొడుకు రాజామణి ఎమ్మే పూర్తి చేసి ఉద్యోగం దొరక్క హైదరాబాద్‌లో ఏదో ట్యుటోరియల్ కాలేజీలో పని చేస్తున్నాడు. ఇంటి కేమీ పంపలేకపోయినా తన పొట్ట తాను పోసుకుంటున్నాడు. చాలీ చాలని ఆదాయం ఆ కుటుంబ అవసరాలకు అందకపోయినా, ఆ అరవ పిల్లలు మాత్రం అందానికీ, ఆకర్షణకూ హద్దులుగా

నిలబడ్డారు.

మంచాన పడ్డ ముసలివాడు, అమ్మ లక్కాలతో కబుర్లతో కాలక్షేపం చేసే ఆ ఇంటి ఇల్లాలు తాయారమ్మ, ఇంటి పనుల ఊబిలో గొంతుకదాకా కూరుకుపోయిన ఇంటి కోడలు కర్పగం - ఊళ్ళోని పడుచుగుండెల వీణల్ని మీటింది వీళ్ళెవరూ కాదు. ఆ పని చేసిన వాళ్ళు వళ్ళియప్ప కూతుళ్ళు. వాళ్ళ వయస్సులు వరసగా పద్దెనిమిది నుంచి పన్నెండేళ్ళ దాకా ఉంటాయి. వాసంతీ, రాణీ పదో తరగతి పాసై ఇంట్లో కూర్చున్నారు. కస్తూరి పదీ, సెందామరై తొమ్మిదీ, అముద ఏడు చదువుతున్నారు, బస్తీలోని హైస్కూల్లో.

సొమ్ములు లేకపోయినా, సొంపులూ సోయగాలూ అన్నీ వాళ్ళ ఒంటిమీద తీగల్లా అల్లుకుని పెరుగుతున్నాయి. సూర్యోదయ వేళ రెక్కలొచ్చిన కదంబాల దండలా మైలు దూరం చేలల్లోకి వెళ్ళివస్తారు వాళ్ళు. ఊరి చివరనున్న పంపు బావి దగ్గర నుంచి అంచెలంచెలుగా మంచినీళ్ళ బిందెలందించుకుంటారు. ప్రతిరోజూ స్నానాలు చేస్తారు. పావడలూ, వోణీలూ పుతుక్కుని ఇంటి ముందర ఆరవేసుకుంటారు, తల నిండా పువ్వులు తురుముకుంటారు. అప్పుడే పూచిన పువ్వుల్లా ఎప్పుడూ నవ్వుతుంటారు. చుట్టూ పొలాల వెంట, కంచెల వెంట కూరాకు కోసమో, కట్టెపుల్లల కోసమో రామ చిలకల్లా తిరుగుతూ ఉంటారు. నాయుడు వంకలో, వాళ్ళ సంరంభం - వలరాచ జాతరే!

పల్లెలోని పడుచువాళ్ళ తేటకళ్ళన్నీ వాళ్ళవైపు తిరిగి వాళ్ళ అందాలకు అద్దం పట్టేవి. ప్రతి కుర్రాడూ మాట కలపటంతో మొదలు పెట్టి వాళ్ళ ఇంటి అరుగుల మీద కూర్చుని కాలక్షేపం చేయటం దాకా పరిచయాలు పెంచుకున్నారు. నవ్వులే నవరత్నాల విలువ చేస్తాయనుకున్నారేమో, కొండంతదేవుడికి గోరంత తులసీదళం సమర్పించుకున్నట్లు, ఒకటో రెండో బెల్లపు ముద్దలు, పట్టెడో బుట్టెడో వేరు సెనక్కాయలూ తెచ్చియిచ్చి తమ సౌహార్దతను ప్రకటించుకునేవాళ్ళు. నాయుడు వంకకు వచ్చిన మూడు నెలలకే ముసలాయన కన్ను మూసిన సందర్భంలో సాక్షాత్తూ కాళ్ళు కడిగి కన్యాదానం చేసిన మామగారే పోయినంత బాధతో కన్నీళ్ళుగార్చారు.

ఊళ్ళో వాళ్లంతా ఆ అమ్మాయిల్ని ముత్యాలన్నారు. రత్నాలన్నారు. ఆడపిల్లలైతేనేం, సుగుణాల దొంతరలన్నారు. ఎవరేపని చెప్పినా ఎదురు చెప్పకుండా చేసేవాళ్ళను ఎవరైనా అలా అనకుండా ఇంకేమంటారు?

తాయారమ్మ కుటుంబానికి అందరికంటే ఎక్కువ సాన్నిహిత్యం కాంతమ్మతోనే. తాయారమ్మ ఇంటి పక్కనే ఉంది కాంతమ్మ ఇల్లు. కాంతమ్మకు

మొగుడుపోయి పదేళ్ళయింది. కొద్దిపాటి ఆస్తి ఉంది. కూతుర్ని పొరుగూళ్ళోనే ఓ రైతుకిచ్చింది. ఇరవై ఏళ్ళ కొడుకుమాత్రం ఉన్నాడు. వాడి పేరు చిన్ని కృష్ణమ నాయుడు. అందరూ చిన్నీ అని పిలుస్తారు. ఎనిమిదో తరగతితో చదువుకు స్వస్తి చెప్పి, సేద్యం చేసుకుంటున్నాడు.

కాంతమ్మ చాలా పొదుపరి. పైగా లౌక్యం తెలిసిన మనిషి. 'మాటలు తేటలు మా ఇంట, మాపటి భోజనం మీ ఇంట' అనే రకం. ఆ అరవ పిల్లలతో తేనె మాటలు మాట్లాడుతూ, వాళ్ళచేత అన్ని పనులూ చేయించుకుంటోంది.

ఋష్యశృంగుడిలా ఉన్న చిన్నీ మీద మన్మథుడు తన ప్రయోగాన్ని ప్రారంభించాడు. పలుకే బంగారమన్నట్లుండే చిన్నీ ఆ అమ్మాయిల సహకారంతో అరవం మాట్లాడటం నేర్చుకున్నాడు. ఇన్నాళ్ళు నాలుగు మూరల పంచే బనీనుతో తిరిగినవాడు ఇప్పుడు గళ్ళలుంగీలూ, టెరీకాటన్ బట్టలూ తొడుక్కుంటున్నాడు. వాచీ కొనుక్కున్నాడు. వందాయాభై రూపాయలు పెట్టి ట్రాన్సిస్టర్ తెచ్చాడు. అది ఆ రెండిళ్ళ గుమ్మాలూ ఎక్కుతూ దిగుతూ పెద్ద గొంతుకతో ప్రణయ గీతాలు ఆలపిస్తోంది. వాసంతీ, చిన్నీ ముఖాల్లో పొంగులు వారే కొత్త మిసిమిని అందరూ గమనించారు. వాసంతి కాంతమ్మ ఇంటికి తనే నీళ్ళు తెచ్చిపోస్తున్నది. ఆమె దగ్గర్నుంచి బిందెలు మార్చుకునే అవకాశాన్ని చిన్ని ఒక్క రోజు కూడా జారవిడుచుకోవడంలేదు. ఒకరినొకరు అదే పనిగా చూసుకుంటున్నారు. కాంతమ్మకు అన్నీ తెలుసు. తాను ఇంట్లో లేని వేళల్లో వ్యవహారం శృతి మించి రాగాన పడిన విషయం కూడా ఆమెకు తెలుసు. అయినా, ఆమె తెలియనట్లే ఉండిపోయింది.

వాసంతి ఇంట్లో వాళ్ళు మాత్రం ఊరుకోలేదు. బాల మురుగన్ చెల్లెల్ని చీవాట్లు పెట్టి చెంపలు వాయించాడు. "నీ కొడుకు చేస్తున్న పనేమైనా బాగుందా?" అని అడిగింది తాయారమ్మ కాంతమ్మను గుట్టుగా. 'మావాడికేం - మగాడు. పది మందితో తిరుగుతాడు. ఆడపిల్లను మీరు అదుపులో పెట్టుకోవాలిగానీ!' అంటూ రట్టు చేసింది కాంతమ్మ.

ఆ తరువాత ఆ ఇంటికాకి ఈ ఇంటిమీద వాలలేదు.

ఓ రోజున అయిదుగురు అక్క చెల్లెళ్ళూ పులిహోర, పెరుగన్నం కట్టుకుని, రెండు మైళ్ళ దూరాన గుట్ట మీద ఉన్న శివాలయం దగ్గరికి పిక్నిక్ వెళ్ళారు. ఆ గుట్టమీదే వాసంతిని కలుసుకొన్నాడు చిన్ని. ఆమె మెడలో పసుపుతాడు కట్టాడు. సాయంకాలం తిరుగు ప్రయాణం కడుతూ 'మీరు వెళుతూ ఉండండి, మేమిద్దరం వెనకే వస్తాం' అన్నాడు. చెల్లెళ్ళు నలుగురూ ఇల్లు చేరుకున్నారు.

వాసంతిని వెంట బెట్టుకుని, ఆ రాత్రికి రాత్రే - పొరుగూళ్ళో ఉన్న అక్కగారిల్లు చేరుకున్నాడు చిన్ని. సంగతి తెలుసుకుని, అక్కా బావా ముక్కున వేలేసుకున్నారు. 'మీరేం భయపడకండి. కార్యం నేను చక్కబెడతానులే' అన్నాడు బావ.

మరునాటి ఉదయం అతను వాసంతిని మాత్రం ముందుగా సాగనంపి, బావమరిదిని వెంటబెట్టుకుని నాయుడు వంక చేరుకున్నాడు. వాసంతి తల్లి ఏడ్చి మొత్తుకుంది. అంతకు పదింతలుగా హంగామా చేసింది కాంతమ్మ. 'దొమ్మరిగుంపు వొచ్చిపడి నా కొడుకునెత్తిన మిరపరాయి నూరిందిమ్మో' అంటూ శోకాలు తీసింది. వాసంతి మెడలో పసుపుతాడును పుటుక్కున తెంపేసింది. ఆ ఊళ్ళోనే ఉంటోన్న కాంతమ్మ తమ్ముడు - చిన్నీ మేనమామ రంగంలోకి దిగాడు. ఆయనకు పధ్నాలుగేళ్ళ కూతురుంది. పేరు పుష్పలత. సరిగ్గా ఆ రోజే సమర్తాడి తడిక చాటున కూర్చుని ఉంది. 'నాకూతుర్ని ఏ బావిలో తొయ్యమంటావక్కా?' అని నిలదీసి అడిగాడు కాంతమ్మ తమ్ముడు. నాయుడు వంకలోని వాళ్ళంతా ఒక్కటైనారు. వాసంతి తల్లినీ, అన్నయ్యనూ కాకుల్లా పొడిచారు. వాళ్ళ బెదిరింపుల ఫలితంగా, వారం తిరక్కుండానే ఇల్లొదిలి, బస్తీలో అద్దెయింటికి కాపురం మార్చారు వాసంతివాళ్ళు.

ఒకప్పుడు వాళ్ళను మెచ్చుకున్న వాళ్ళే ఇప్పుడు బండబూతులు తిడుతున్నారు. వాసంతి ఇంటి అరుగుమీద పొద్దు పుచ్చిన కుర్రవాళ్ళంతా ఇపుడు చిన్నిని చూసి చెవులు కొరుక్కుంటున్నారు. పరిస్థితులకు తల ఒగ్గక తప్పలేదు చిన్నీకి. మేనమామ కూతురుతో పెళ్ళికి ముమ్మరంగా ఏర్పాట్లు ప్రారంభమైనాయి. కాంతమ్మ పూరిల్లు మరమ్మత్తు చేయబడింది. ఇంటి చుట్టూ ఉన్న స్థలమంతా చదును చేయబడింది. ఇక రేపో మాపో తాంబూలాలు మార్చుకుంటే, ఆ పై వారం పెళ్ళి జరిగిపోతుంది.

ఆ రోజు ఉదయం పేడ గంపకెత్తుకుని దిబ్బలో వేసి రావటానికి వెళ్ళింది కాంతమ్మ. ఇంట్లో చిన్నీ ఒక్కడే ఉన్నాడు. కాబోయే పెళ్ళికూతురు పుష్పలత గుమ్మంలోంచి లోపలికి తొంగిచూచింది. 'ఏం పుష్పా' అన్నాడు చిన్నీ.

'అత్తయ్య లేదూ?' అని అడిగింది పుష్పలత.

'లేదు' అన్నాడు చిన్నీ ముక్తసరిగా.

'బావా, రాత్రి సినిమాకు వెళ్ళాను' అంది పుష్పలత. మాట్లాడలేదు చిన్నీ.

'సినిమాలో వాసంతి కనిపించింది--'

అతను ముద్దులా వింటుంటే, ఒక్కొక్క మాటే జారవిడిచిందామె. 'రేపు తిరుపతికి తీసుకుపోతారట.... ఎందుకని అడగవేం బావా?' అంటూ ముఖం చాటుగా తిప్పుకుని, 'పాపం, కడుపుతీయించేస్తారట!' అంది.

ఇంతలో కాంతమ్మ వచ్చింది. 'కాల్లో ముల్లు గుచ్చుకుందత్తా! మల్లి ముల్లు కోసం వచ్చాను' అంటూ అరుగుమీద కూర్చుంది పుష్పలత.

సాయంకాలం సినిమా కని వెళ్ళిన చిన్నీ ఇంటికి తిరిగి రానేలేదు. మరునాడు వాకబు చేస్తే, వాసంతి కూడా మాయమైనట్లు తెలిసింది.

నాయుడు వంకలోని పెద్దల ఆంక్షల్ని ధిక్కరిస్తూ బాడిసచెట్లు మళ్ళీ ఎర్రపూలు పూశాయి. చెట్లు ఎండుటాకుల్ని రాల్చి కొత్త చివుళ్ళు తొడిగాయి. కలకంఠకూజితాలూ, భ్రమరగీతాలూ గాలితెప్పలెక్కి గగన విహారానికి ఆయత్తమైనాయి.

పుష్పలత ఇంటివాకిట మల్లెపందిరి మొగ్గలు తొడిగింది. విరిసిన మల్లెల వాసనల కొత్తదనానికి పుష్పలత మనసు పరవశించింది.

• ప్రభవ మాస పత్రిక మే 1979 •